క్లుప్తంగా

ఘనంగా కడప రాయుని మాసోత్సవం



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి మాసోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఇన్స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు మయూరం కృష్ణమోహన్ బృందం తొలుత మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను కనుల పండువగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని గోవింద నామస్మరణల మధ్య దేవునికడప మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు తమ ఇళ్ల వద్దకే తరలివచ్చిన దేవతామూర్తులను దర్శించుకుని పూజా సామాగ్రిని అందజేసి మొక్కుకున్నారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాలు కోరాయి. ఈ బంద్‌కు సంబంధించిన పోస్టర్స్‌ను శనివారం కడపలోని ఐటిఐ కళాశాలలో వారు విడుదల చేశారు. అనంతరం నగరంలోని పలు కళాశాలలను కలిసి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎఐఎస్‌బి, ఎస్ఎస్‌యూఐ, టిఎన్ఎస్ఎఫ్, ఎస్వైఎఫ్, ఆర్ఎస్‌యూ విద్యార్థి సంఘ నాయకులు సుబ్బరాయుడు, వలరాజు, జయవర్ధన్, భరత్, సుదీర్‌బాబు, నాగేంద్ర, చెన్నకేశవలు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. వయస్సు 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి బెంగుళూరులో 35 రోజులపాటు భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తిగల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

సబ్సిడీతో టమాటాల విక్రయం



టమాటాల కోసం క్యూలో ఉన్న వినియోగదారులు

కడప అగ్రికల్చర్ : ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేస్తున్న టమాట పంపిణీ శనివారం కడప రైతు బజార్‌లో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 6 గంటలకే వినియోగదారులు టమాటాల కోసం రైతు బజార్ వద్ద క్యూ కట్టారు. రైతు బజార్‌కు వచ్చిన రెండు టన్నుల టమాటాలను ఒకొక్కరికి కిలో చొప్పున రైతు బజార్ మేనేజర్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది మధ్యాహ్నం 1 గంట వరకు పంపిణీ చేశారు. అయితే కొద్దిరోజులుగా కొండెక్కి కూర్చొన్న టమాటా ధరలు శనివారం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.70 పలికింది. వారం రోజుల క్రితం కిలో రూ.100 ఉన్న ధర క్రమేపి తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం అనంతపురం నుంచి టమాటాలు మార్కెట్‌కు రావడంతోపాటు మరో పది, పదిహేను రోజుల్లో మైదుకూరు ప్రాంతం నుంచి కూడా టమాటాలు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మన ప్రాంత టమాటాలు వస్తే ధర మరింత తగ్గే అవకాశం ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

తిలక్‌నగర్‌లోని సమస్యలను పరిష్కరించాలి

కడప కార్పొరేషన్ : కడప నగర శివార్లలో ఉన్న తిలక్‌నగర్‌లోని సమస్యలను పరిష్కరించాలని మైనార్టీ రైట్స్ ఫోరం కన్వీనర్ షేక్ దస్తగిరి, స్థానిక ఇన్‌చార్జి మోహన్‌కుమార్ అన్నారు. శనివారం వారు స్థానికులతో కలిసి తిలక్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిలక్ నగర్ 20 ఏళ్లక్రితం ఏర్పడినా సమస్యలు మాత్రం అప్పటి నుంచి ఇప్పటికీ అలాగే ఉన్నాయన్నారు. ప్రభుత్వంగానీ, నగర పాలకులుగానీ ఈ సమస్యలపై దృష్టిసారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాకు గురవుతున్న రోడ్లను విస్తరించి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఇండియన్ ఆర్ట్ అండ్ హెరిటేజ్ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ తదితరులు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయంలో లలిత కళా విభాగం అధిపతి కోట మృత్యుంజయరావు రచించిన ఇండియన్ ఆర్ట్ అండ్ హెరిటేజ్ పుస్తకాన్ని విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత మృత్యుంజయరావును ఆయన అభినందించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ అధ్యాపక వృత్తితోపాటు విస్తృత పరిశోధన, పుస్తక ప్రచురణల వల్ల విశ్వ విద్యాలయ ఖ్యాతి కూడా విస్తరిస్తుందన్నారు. భారతదేశ కళా సంపద గొప్పదనాన్ని, సాంస్కృతిక సంపదను కళాదృష్టితో రచయిత ఈ పుస్తకంలో సమగ్రంగా చర్చించారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ భారతీయ చిత్ర శిల్పకళ సౌందర్యాన్ని, గొప్పదనాన్ని రచయిత చక్కగా ఈ పుస్తకంలో పొందు పరిచారన్నారు. దేశంలో కళ, చరిత్ర, విద్యార్థులకి, పరిశోధకులకి ఈ పుస్తకం ఒక చుక్కానిలా పనిచేస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ మన యూనివర్సిటీలో లలిత కళా విభాగం ఇప్పటికే ఎంతో పేరు సంపాదించిందని.. ఈ ప్రచురణ రావడంతో మరింత పేరు వస్తుందన్నారు. పుస్తక రచయిత డాక్టర్ మృత్యుంజయరావు మాట్లాడుతూ మన దేశ చిత్ర, శిల్పవాస్తుల వైశిష్ట్యాన్ని, గొప్పదనాన్ని కళాకారుడిగా వివరించగలిగానన్న తృప్తి వస్తుందని తెలిపారు. ఈ పుస్తకంలో 11 అధ్యాయాలతో సుమారు 40 వర్ణ చిత్రాలతో అమరావతి శిల్పకళ నుంచి సమకాలిక చిత్రకళ, రాయలసీమలోని లేపాక్షి చిత్రకళ, తోలు బొమ్మల ఆటలు, దేశ కళా వారసత్వ సంపద, చారిత్రక నేపథ్యం వాటి గొప్పదనాన్ని వివరించానన్నారు. ఆనాటి సాంకేతిక పద్ధతులు, నాటి విజయనగర సామ్రాజ్య కాలం నుంచి ఫ్యాషన్ తదితర అంశాలను చర్చించామన్నారు. ఇందుకు ప్రోత్సహించిన యూనివర్సిటీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ క్యూ సీ ఏ సంచాలకులు లోకా సుబ్రమణ్యంశర్మ, హిస్టరి విభాగం ఆచార్యులు కంకణాల గంగయ్య, లలిత కళా విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వల్లూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

వల్లూరు : కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వల్లూరులోని గ్రామ సచివాలయ ఆవరణలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నవరత్నాలు పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడమే కాక చెప్పని పథకాలను కూడా అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో వేలాది హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కే, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఒక వైపు, సంక్షేమ పథకాల అమలులో రికార్డు సృష్టించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక వైపు వచ్చే ఎన్నికల్లో తలపడనున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ వెన్నంటి వుండాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలకు ఉచితంగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు గంగయ్య, సుబ్బరాయుడు, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, కిషోర్‌కుమార్, నారాయణరెడ్డి, పిచ్చిరెడ్డి, సుబ్బారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, బాలిరెడ్డి, గోము సుబ్బారెడ్డి, శశికుమార్‌రెడ్డి, కరుణాకర్, ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఏవో సాయిజ్యోతి, ఎంఈవో లిల్లెమ్మ, ఏపీవో పార్థసారధి పాల్గొన్నారు.

చిన్నారులకు క్రమం తప్పక టీకాలు వేయించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న మెడికల్ ఆఫీసర్ ప్రశాంత్ వర్ధన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : వివిధ వ్యాధుల నుంచి సంరక్షించేందుకు చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని నాగరాజుపేట పట్టణ ఆరోగ్య శిక్షణా కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. శనివారం నగరంలోని హాజీ గఫూర్ స్ట్రీట్‌లోని అంగన్వాడీ కేంద్రం, శిక్షణా కేంద్రాన్ని హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్.ప్రసన్న లత ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులకు సక్రమంగా అందించాలని సూచించారు. టీకాల ద్వారా అనేక వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ముఖ్యంగా బిడ్డ పుట్టినప్పటినుంచి నిర్ణీత సమయంలో టీకాలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఇందుకుగాను ఇంటింటికి వెళ్లి సకాలంలో టీకాలు వేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంగా తల్లిదండ్రులను చైతన్యవంతులను చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు గుల్జార్‌బేగం, సుబ్బరాయుడు, అంగన్వాడీ వర్కర్ లక్ష్మీదేవి, సాయిదివ్య, ఆశా వర్కర్లు, శిక్షణా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మారణ హోమాన్ని వెంటనే ఆపాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ పెద్దలు, విశ్వాసులు



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపడుతున్న అఖిలపక్ష నాయకులు

కడప కల్చరల్ : మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని వెంటనే ఆపాలని కడప ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఎండీ ప్రసాద్‌రావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో ఆయన మాట్లాడారు. కొద్దికాలంగా మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని ఆపాలన్నారు. ఆ ఘర్షణలో అమరులైనవారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మణిపూర్ నుంచి వచ్చిన వారితో కలిసి ఈ ప్రార్థనలు నిర్వహించారు. ఆ ప్రాంతంలోని ప్రజలంతా శాంతి, కరుణ, దయ తదితర లక్షణాలు కలిగి ఉండాలని కోరుతూ ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం నుంచి మహావీర్ సర్కిల్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఆ సర్కిల్‌లో మణిపూర్ మారణహోమాన్ని వెంటనే ముగించేందుకు పౌరులంతా తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ మారణ కాండ వెంటనే ఆగిపోయి, అమానుష కృత్యాలకు ముగింపు లభించాలని ప్రార్థనలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, మదర్లు, చర్చి కమిటీ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలో నిందితులను శిక్షించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశంలో మణిపూర్‌లో గిరిజనులపై జరుగుతున్న మారణ హోమాన్ని ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో మణిపూర్‌లో గిరిజనులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష పార్టీల నాయకులు చంద్రశేఖర్, సత్తార్ అవ్వారు మల్లిఖార్జున, డాక్టర్ ఓబుల్ రెడ్డి, పాల్గొన్నారు.

దేశంలో మహిళలకు రక్షణ కరువైందని కాంగ్రెస్ పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఎర్రముక్కపల్లె సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విష్ణు ప్రీతంరెడ్డి, పుల్లయ్య, శ్రీనివాసులు, కుళ్ళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్ : మణిపూర్ రాష్ట్రంలో హింసకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైఎస్సార్‌సీపీ యువజన జిల్లా కార్యదర్శి పస్తం అంజి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి, కేంద్ర బలగాల సాయంతో అల్లర్లను ఉక్కుపాదంతో అణిచివేయాల్సిన కేంద్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూడటం అన్యాయమన్నారు.

సంక్షోభంలో యూనివర్సిటీ విద్య



మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

కడప ఎడ్యుకేషన్ : యూనివర్సిటీ విద్యను ప్రభుత్వాలు సంక్షోభంలోకి నెట్టాయని మానవ హక్కుల వేదిక, పదవీ విరమణ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అన్నారు. కడప యూటీఎఫ్ భవన్‌లో శనివారం పీడీఎస్‌యూ రెండురోజుల రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు ప్రారంభమయాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలలో వేలాది టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని భర్తీ చేసి యూనివర్సిటీ విద్యను బలోపేతం చేయాలన్నారు. ప్రగతి నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని కాపాడాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు అనే అంశంపై న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ వేంకటేశ్వర్లు బోధించారు. క్లాసుల ప్రారంభానికి ముందు పీడీఎస్‌యూ జెండాను రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, కిరణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్, సునీల్, జునితబాష, రాష్ట్ర కోశాధికారి జాకీర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, లోకేష్ కడప జిల్లా అధ్యక్షులు నాగేశ్వర, కడప నాయకులు శ్రీనాథ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

చెన్నూరు : మండలంలోని రామనపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో శనివారం అర్హులైన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తనిఖీ చేసి పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. అర్హులైన వారికి అందరికీ కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా అందిస్తారని తెలిపారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

అలాగే రాచిన్నాయపల్లెలో పిల్లలకు టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అలాగే చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి ఓపీ, ఐపీ సేవలు సక్రమంగా నిర్వహించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

చింతకొమ్మదిన్నె : మండలంలోని లక్కిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం ఉచిత వైద్య మెగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సహస్ర ఫౌండేషన్ అధ్యక్షుడు నాగమల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యా శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, విష జ్వరాలపై శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్ టెస్టులు ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

పోస్టర్లు విడుదల

ప్రొద్దుటూరు : స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం ఆవరణలో ఈనెల 26న విజయవాడలో జరిగే ఏపీ వీటీయూఎస్‌సీ రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్లను స్ట్రగుల్ కమిటీ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ పొన్న శివయ్య, సర్కిల్ అధ్యక్షుడు ఇడెం లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, యూఈఈయూ డివిజన్ అధ్యక్షుడు లెనిన్ బాబు, ఆదినారాయణ, యూఈసీడబ్ల్యూసీ నాయకులు నాగరత్నాచారి, ఓబులేసు, మధు తదితరులు పాల్గొన్నారు.

యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్న అధ్యాపకురాలు

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాలలో పారాసైటాలజి హెచ్‌ఓడీగా పనిచేస్తున్న డాక్టర్ సిరిగిరెడ్డి శివజ్యోతి యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. తిరుపతిలోని పశువైద్యవిశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన సభలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా ఆమె యంగ్ సైంటిస్ అవార్డు అందుకున్నారు. పశువులలో కుందేటి వ్యాధి గురించి పరిశోధనలు చేసిన ఈమె పీహెచ్‌డీ పట్టా పొందారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి ఆఫ్ యోగివేమన యూనివర్సిటీలో శనివారం ఎన్ఎస్ఎస్, స్టెప్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగరాజు అధ్యక్షత వహించగా ఇండస్ట్రియల్ ప్రామోషన్ ఆఫీసర్ నూర్ అహ్మద్ కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు.

కార్మికులకు రూ.18,500 వేతనం ఇవ్వాలి



మేయర్ సురేష్ బాబుకు వినతి పత్రం సమర్పిస్తున్న నగరపాలక ఇంజినీరింగ్ కార్మికులు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న తమకు జీవో నంబర్ 7 ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాలని ఔట్‌సోర్సింగ్ కార్మికులు కోరారు. శనివారం మేయర్ సురేష్ బాబుకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎక్కడా ఇవ్వకపోయినా కడపలో మేయర్ ఆధ్వర్యంలో డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.18,500 వర్తింపజేశారన్నారు. వారికి ఇచ్చినట్లుగానే ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లకు కూడా వేతనం పెంచాలని కోరారు. దీనిపై మేయర్ స్పందిస్తూ ఈ అంశాన్ని స్టాండింగ్ కమిటీ సమావేశంలో పెట్టి జీతాల పెంపునకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్. గోపి. జిల్లా సహాయ కార్యదర్శి ఆనందరావు, కె. ధనుంజయ, ప్రదీప్‌కుమార్, శ్రీరాములు, రామాంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.


సందడిగా జీవిత బీమా ప్లాంట్-యే-లైఫ్



మొక్క నాటుతున్న ఎల్ఐసీ అధికారులు

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థ కడప శాఖ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దేశంలోని అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ భారత జీవిత బీమా సంస్థ చైర్మన్ సిద్దార్థ మొహంతి పిలుపు మేరకు సంస్థ కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ ఉన్నత పాఠశాల ఆవరణలో కడపశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎల్ఐసీ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ జి.సంజీవ ప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఆగస్టు 31వ తేదీలోపుగా దేశ వ్యాప్తంగా రెండు కోట్ల మొక్కలను నాటాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా సీఎస్ఐ ఉన్నత పాఠశాల ఆవరణలో వంద మొక్కలను నాటామన్నారు. ఈ కార్యక్రమంలో శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ వెంకట కృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ డి.విజయ్‌కుమార్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జేవీవీ పట్టణ కార్యదర్శి సునీత

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జేవీవీ పట్టణ కార్యదర్శి సునీత పేర్కొన్నారు. శనివారం జేవీవీ ఆధ్వర్యంలో స్కాలర్స్ హైస్కూల్‌లో శాస్త్రీయ ఆలోచన అంటే ఏమిటి అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి దేశం అభివృద్ధి చెందాలంటే శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాలన్నారు. ప్రజలు అశాస్త్రీయ అంశాలను నమ్మరాదని, హేతుబద్దంగా ఆలోచించాలని సూచించారు. విరసం వరలక్ష్మి మాట్లాడుతూ సైన్స్ పెరగడంతోనే మానవాళికి రక్షణ ఉంటుందని తెలిపారు. సైన్స్ నిత్య నూతనంగా మారుతుందని, నిజాలు తెలిసినప్పుడే భయాలు పోతాయని చెప్పారు. న్యాయవాది హరిత మాట్లాడుతూ ప్రశ్నించడం ద్వారానే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు తవ్వా సురేష్, పాఠశాల హెచ్ఎం రాజేంద్ర ప్రసాద్, స్కూల్ ఇన్‌చార్జి రాధా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, ఎంఈఓ గంగిరెడ్డి

చెన్నూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మెనూ ప్రకారం అందిస్తున్న భోజనాన్ని ఎంఈఓ గంగిరెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్‌లు పరిశీలించి మాట్లాడారు. నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా లేదా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి ప నులను, వసతులను పరిశీలించారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి



కాగితాల పెంటలో ప్రాథమిక పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ వెంకట క్రిష్టారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్టారెడ్డి సూచించారు. శనివారం కడప ఎమ్మార్సీ నుంచి పాఠశాలలకు తరలించే సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం కాగితాలపెంట మండల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించిన వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. తదనంతరం చెమ్మియాపేట బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి అక్కడ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం తరగతి గదికి వెళ్లి పాఠ్యపుస్తకాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులంతా తప్పని సరిగా లెసన్ ప్లాన్ రాయాలన్నారు. తరగతి గదిలో స్నేహపూర్వక వాతావరణంలో బోధన, అభ్యసన జరగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ పాలెం నారాయణ, హెచ్ఎం మేరీ, కాగితాలపెంట్ హెచ్ఎం బాలానాయుడు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేయాలి



కమలాపురంలో ఈ-క్రాప్ బుకింగ్ చేసే విధానాన్ని వివరిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : ఖరీఫ్ 2023లో పంటలు సాగు చేసిన రైతుల పంట పొలాలను సందర్శించి ఈ-క్రాప్ బుకింగ్‌ను జియో కోఆర్డినేట్స్ సమన్వయంతో పక్కాగా చేయాలని ఏఓ సరస్వతి తెలిపారు. శనివారం కమలాపురం 4వ ఆర్‌బీకేలో మండలంలోని వీఏఏ, వీఆర్‌ఓ, సర్వేయర్లకు ఈ-క్రాప్ బుకింగ్ యాప్‌పై టెక్నికల్ పర్సన్ మహేశ్వర్‌రెడ్డి శిక్షణనిచ్చారు. ఈ-క్రాప్ బుకింగ్ యాప్ గురించి వీడియో ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తూ అవగాహన కల్పించారు. సర్వే నెంబర్ వద్దకు వెళితేనే యాప్‌లో మైబైల్ కెమెరా ఆన్ అవుతుందని, అప్పుడు మాత్రమే ఈ-క్రాప్ బుకింగ్ చేయాల్సి ఉంటుందని ఆమె వివరించారు. ఏ మాత్రం అవినీతికి ఆస్కారం లేకుండా ఈ యాప్ రూపొందించారన్నారు. సర్వే నెంబర్‌కు కొంత దూరంలో ఉన్నా కెమెరా ఆన్ కాదన్నారు. రైతు ఒక చోట ఉండి మరో చోట ఈ-క్రాప్ బుకింగ్ చేయాలంటే కుదరదన్నారు. ఇన్సూరెన్స్, క్రాప్ బుకింగ్, సున్నా వడ్డీ పంట రుణాలు, కనీస మద్దతు ధర ఇలా అన్ని రకాల పథకాలకు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి అన్నారు. పీఎం కిసాన్ 14వ విడత డబ్బులు పడాలంటే ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, వీపీఏలు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పంట నమోదుపై వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ అధికారులకు మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంట నమోదు చేయు సమయంలో వ్యవసాయ సహాకులతో పాటు వీఆర్‌ఓలు, సర్వేయర్ ముగ్గురు కలిసి నమోదు చేయాలని చూసించారు. నమోదులో ఎటువంటి తప్పులు లేకుండా పారదర్శకంగా చేపట్టాలన్నారు. నమోదు వివరాలను గ్రామ సభలు నిర్వహించి రైతులకు తెలపాలన్నారు. టెక్నికల్ ఆపరేటర్ గురునాయక్ మాట్లాడుతూ పంట నమోదు యాప్ పనితీరు గురించి తెలియజేశారు. వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

నూతన గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ మధురెడ్డి, లింగాల ఉషారాణి

తొండూరు : స్థానిక నూతన గ్రంథాలయాన్ని శనివారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రూ.40లక్షల పాడా నిధులతో ఈ గ్రంథాలయాన్ని నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు రామమునిరెడ్డి, జిల్లా కార్యదర్శులు రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆమీరుద్దీన్, పులివెందుల మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రంథాలయాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధిక శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా వేకువజాము నుండే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు.